అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
● పలు డివిజన్లలో పనుల పరిశీలన



కల్వర్ట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వెలంపల్లి, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని 53, 54 డివిజన్లలో వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెండా చెట్టు సెంటర్ నుంచి ప్రారంభమైన వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర అధికారుల బృందం డ్రైన్ వీధిలో జరుగుతున్న కాలువ పనులను పరిశీలించారు. వీటిపై నగరపాలక సంస్థ అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి గణపతిరావు రోడ్డులో జరుగుతున్న రహదారి, కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. కృష్ణవేణి మార్కెట్ సమీపంలో ఉన్న కల్వర్ట్‌కు సంబంధించి జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాబూరాజేంద్రప్రసాద్ రోడ్డులోని జెండాచెట్టు సమీపంలో డ్రైనేజీని పరిశీలించి ఎక్కడా చెత్త నిల్వ ఉండకుండా త్వరితగతిన మురుగు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మినార్ మసీదు సమీపంలో రోడ్డును అనుకొని ఉన్న డ్రైనేజీ వ్యవస్థను, జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. వీఎంసీ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, ఆర్షద్, మరుపిళ్ల రాజేష్, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యుడు గురుమహంతు మహేష్, చాంబర్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, కృష్ణవేణి మార్కెట్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్, నాయకులు చాన్ బాషా, అన్వర్, ప్రసాద్, సమీర్ పాల్గొన్నారు.

ఈద్గాలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో నమాజ్ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బక్రీద్ పురస్కరించుకుని చిట్టినగర్ ఈద్గాలో నిర్వహించే సామూహిక ప్రార్థనలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్టినగర్ మోతీ మసీదు ఈద్గాలో ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. షామియానాలు, మంచినీటి సదుపాయం తదితర ఏర్పాట్లపై మసీదు కమిటీ పెద్దలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈద్గా అధ్యక్షులు ఖాజా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

● **వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని పశ్చిమలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పర్వదినం రోజు పొట్టేలు మాంసాన్ని పేదలకు అందించడం ఇస్లాం సంప్రదాయం. అందులో భాగంగా గొర్రెపోతుల విక్రయాలతో పంజా సెంటర్ సందడిగా దర్శనమిస్తోంది. భవానీపురం, విద్యాధరపురం, గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో నమాజ్‌లకు టెంట్లు వేసి పలు ఏర్పాట్లు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ తెలిపారు. మానవులు శాంతియుత జీవనం చేయాలని కోరారు. బక్రీద్ స్ఫూర్తితో పరుల కోసం సేవ చేస్తూ అందరూ ముందుకుసాగాలని వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. అందరూ సంతోషంగా గడపాలని కోరారు.

మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్



కేఎల్‌రావునగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గౌస్ మొహిద్దీన్



విద్యాధరపురం తాజ్ మసీదులో మైనార్టీ పెద్దలతో మాట్లాడుతున్న మొహమూద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ముస్లిం మైనార్టీలకు కోట్లాది రూపాయల లబ్ధి చేకూరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్ కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన కేఎల్‌రావు నగర్‌లోని మస్జిద్ – ఎ – ఫాతిమ మసీదు వద్ద 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి జుహర్ నమాజును ఆచరించారు. అనంతరం గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వానికి, మైనార్టీల పక్షపాతి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ఉర్దూకు అధికార భాష హోదా కల్పించడమే కాకుండా పేద ఆడపిల్లల వివాహాలకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేస్తోందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బాజీ షహీద్, షేక్ బడే మియా, స్థానిక నాయకులు గోదావరి బాబు, మసీద్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా, సెక్రటరీ ఎండీ గౌస్, రెహమాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపాలెం సెంటర్‌లో..

పేదరికంలో ఉన్న ముస్లిం మైనార్టీ కుటుంబాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ మొహమూద్ అన్నారు. ఆయన 38వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద బుధవారం సాయంత్రం 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్ కె సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఏపీ హిస్టరీ అకాడమి డైరెక్టర్ వాజిద్ ఖాన్‌తో కలిసి అసర్ నమాజును ఆచరించిన అనంతరం మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేసిన ఖర్చును గణాంకాలతో వివరించారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి జగనన్న ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు ఎస్‌కే నజీర్, ఖాజా, గౌసీ, అలీ, మసీదు కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీజ్, సెక్రటరీ షంషుద్దీన్, ట్రెజరర్ ఎస్‌కె ముజీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు..



'మార్పు' డైరెక్టర్ సూయజ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కల్పన తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మార్పు ట్రస్టు డైరెక్టర్, ఏపీ మహిళా కమిషన్ మాజీ డైరెక్టర్ రావూరి సూయజ్ అన్నారు. ఎంజీ రోడ్డులోని సిద్ధార్థ మహిళా కళాశాలలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైం కౌన్సిల్(ఎన్‌హెచ్‌ఆర్ ఏసీసీ), ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా బుధవారం ప్రొటెక్షన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. సూయజ్ మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలను సూచించారు. 'మార్పు'తో మహిళల సాధికారతకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఆర్ ఏసీసీ డైరెక్టర్ ఆర్‌జే రాజు మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని పరిరక్షించడానికి తమ కౌన్సిల్ పోరాడుతుందని చెప్పారు. ఆ కౌన్సిల్ ఉమెన్‌వింగ్ ప్రతినిధి చిరుగుపాటి లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, సోషల్ జస్టిస్ రైట్స్ చైర్మన్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహితీసేవా పురస్కారం



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాహితీవేత్త కలిమిశ్రీని కుసుమ ధర్మన్న సాహితీ సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్లు కుసుమ ధర్మన్న సాహితీపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ రాధాకుసుమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సామాజిక ఉద్యమకారుడు కుసుమ ధర్మన్న పేరుతో సాహితీపీఠం ఏర్పాటు చేశామని వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆశయంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 సంవత్సరానికి పత్రికా సంపాదకుడు, కార్టూనిస్ట్ కలిమిశ్రీని పురస్కారానికి ఎంపిక చేశామని వివరించారు. జూలై 16న విజయవాడలో జరిగే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. కలిమిశ్రీ వివిధ పత్రికల్లో చేశారని, నవ్యాంధ్ర రచయితల సంఘం ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పురస్కారానికి ఎంపికైన కలిమిశ్రీని నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

కలెక్టర్ ఢిల్లీరావును కలిసిన ట్రైనీ కలెక్టర్లు



కలెక్టర్ ఢిల్లీరావును క్యాంపు కార్యాలయంలో కలిసిన ఐఏఎస్ ప్రొబేషనరీస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ క్యాడర్ అసిస్టెంట్ కలెక్టర్స్ అండర్ ట్రైనింగ్ 2022 బ్యాచ్ బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్ ఢిల్లీరావును కలిశారు. ఢిల్లీరావును కలిసిన వారిలో ఆయా జిల్లాలకు కేటాయించిన బి.స్మరణ్ రాజ్ (అనకాపల్లి జిల్లా), బి. సహదిత్ వెంకట్ త్రివినాగ్ (విజయనగరం), సి. యశ్వంత్ కుమార్ రెడ్డి (తూర్పుగోదావరి), కల్పశ్రీ కే.ఆర్ (పల్నాడు), మంత్రి మౌర్య భరద్వాజ్ (వైఎస్సార్ జిల్లా), రాఘవేంద్ర మీనా (శ్రీకాకుళం), సౌర్య మన్ పటేల్ (ప్రకాశం), తిరుమణి శ్రీ పూజ (ఏలూరు), వి. సంజనా సింహా (నెల్లూరు) ట్రైనీ కలెక్టర్లు ఉన్నారు.

పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం జరిగింది. వివిధ ఫలపుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలోని సంతాన వేణు గోపాలస్వామికి కూడా తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి నూతన వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఊయలసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజన భక్త బృందం ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, మురళీకృష్ణ తదితరులు చేశారు.

వ్యాధిగ్రస్తులకు వెలంపల్లి ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న సాయిఅశ్విత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలు డివిజన్లకు చెందిన వారికి వెలంపల్లి ఫౌండేషన్ ఆర్థిక సాయం చేసింది. ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం ఫౌండేషన్ చైర్మన్ సాయిఅశ్విత ఆర్థిక సాయం నగదును అందజేసింది. 50, 51 డివిజన్లకు చెందిన సంకాబత్తుల శ్రీనివాసరావు, వెంపాడ యర్రయ్య, కేసరి బాబు అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకుంటున్నారు. వారు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే వెలంపల్లికి వివరించారు. ఆయన ఆదేశాలతో వెలంపల్లి ఫౌండేషన్ ద్వారా సాయమందించారు. ఈ సందర్భంగా సాయిఅశ్విత మాట్లాడుతూ తన తండ్రి వెలంపల్లి శ్రీనివాసరావు డివిజన్ పర్యటనలకు వెళ్లినప్పుడు వీరు ముగ్గురు కొంత ఆర్థిక సాయం చేయాలని కోరారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా సాయమందించామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవ, కొనకళ్ల విద్యాధరరావు, 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 50వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి బంక విజయ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పుష్పాలతో సహస్రనామార్చన



హెచ్‌బీకాలనీలో సాయి మందిరంలో సాయినాథుడికి పుష్పార్చన

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పాత హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణమి ద్వాదశ సప్తాహ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం సాయిబాబాకు పుష్పాలతో పలువురు భక్తులు సహస్రనామార్చన చేశారు. తొలుత ఉదయం 6గంటలకు బాబా విగ్రహాన్ని చెరుకు రసంతో అభిషేకించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి'అనే అఖండ సాయినామ సంకీర్తనతో భక్తులు పరవశించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న సాయిబాబాకు మధ్యాహ్నం పంచహారతులు ఇచ్చిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో భాగంగా గురువారం స్వామివారిని అన్ని రకాల పండ్లతో అలంకరిస్తామని, అనంతరం సాయిబాబాను పంచగంగలతో అభిషేకించనున్నామని మందిరం పాలకమండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమాన్ని పాలకమండలి ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి వెంకట కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనుమానస్పద రీతిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన గర్భాపు సురేష్‌కుమార్(33) తల్లి దండ్రులు చనిపోవడంతో ఓ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. సురేష్‌కుమార్ కాలు విరిగిపోవడంతో వచ్చే పింఛన్ డబ్బులతో ఇంటి అద్దె కట్టి, అప్పుడప్పుడు భిక్షాటన చేస్తుంటాడు. బుధవారం ఉదయం సురేష్‌కుమార్ ఇంటి ముందు పడి ఉండటంతో ఇంటి యజమాని.. సురేష్ తమ్ముడు కనకారావుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వెంటనే సురేష్ కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఘటనపై తమ్ముడు కనకారావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గాఘాట్‌లో ఒలింపిక్ క్రూయిజ్ వేడుకలు



బోట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ తరుణ్ కాకాని

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) సీఈఓ, ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని బుధవారం స్థానిక దుర్గాఘాట్‌లో ఒలింపిక్ క్రూయిజ్ వేడుకలను నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) విజయవాడతో తమ సహకారాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న జాతీయ క్రీడల చాంపియన్ షిప్, ఆ తరువాత ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా రగ్బీలో జాతీయ పతక విజేత టీ హారిక, రెజ్లింగ్ క్రీడలో కిరణ్మయి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రెహమాన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రవీంద్ర, విజయవాడ కార్యదర్శి డాక్టర్ దుర్గారాణి, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ మూర్తిలను డాక్టర్ తరుణ్ కాకాని సత్కరించి అభినందించారు. వేడుకల్లో భాగంగా కృష్ణానదిపై ఏబీసీ బోట్ నుంచి ఒలింపిక్ బెలూన్లను ఎగురవేశారు. ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.సుగుణ రావు, జేఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పటమట(విజయవాడ(తూర్పు): విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కె. ప్రియాంక అన్నారు. పటమట లంకలోని కేఎస్ఆర్ జడ్పీ హైస్కూల్లో బుధవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కె. ప్రియాంక విద్యార్థులకు ఆర్థిక సూత్రాలను వివరించారు. పోటీల్లో వెల్లంకి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు డీఈవో రేణుక బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు.

క్లుప్తంగా

రేపటి వరకు వడ్డీ లేకుండా పన్ను చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. పన్ను చెల్లింపుదారుల కోసం వీఎంసీ సర్కిల్స్ పరిధిలోని అన్ని క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు.

10 నుంచి బ్యూటిషియన్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జూలై 10వ తేదీ నుంచి బ్యూటిషియన్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం బాధ్యులు పి.విజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. త్రెడ్డింగ్, వాక్సింగ్, హెయిర్‌కట్, పెడిక్యూర్, మానిక్యూర్, ఫేషియల్స్ అంశాల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు జూలై 8వ తేదీ లోపు పేర్లను రాఘవయ్య పార్కు సమీపంలోని తమ కార్యాలయంలో గానీ, 0866 2578044, 9490098021 నంబర్లలోగానీ సంప్రదించాలని కోరారు.

అలరించిన నవగ్రహకృతుల గానం



విజయవాడ కల్చరల్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, కళాశాల సాంస్కృతిక కళల విభాగం ఆధ్వర్యంలో భారత అంతరక్ష పరిశోధనా సంస్థ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శిష్టా నటరాజమూర్తి బుధవారం కళాశాలలోనిని కళావేదికపై నవగ్రహకృతులు 2.0 పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆహూతులను అలరించింది. నవగ్రహాలు వాటి గమనం వాటి శాస్త్రీయ విశిష్టత, స్వరూప స్వభావాలను వివరిస్తూ రెండు గంటలపాటు గానం చేశారు. వయోలిన్‌తో బీపీ దుర్గాభవాని, మృదంగంతో అమ్ముల ప్రసాద్ సహకరించారు. కార్యక్రమంలో వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, విశ్రాంత శాస్త్రవేత్త పీఎస్ఎన్ మూర్తి, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్, ఉపవిభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసకృష్ణ పాల్గొన్నారు. కచేరి చేసిన నటరాజ రామకృష్ణతోపాటు అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఉచిత సేవలకు కమిషనర్ ఆమోదం?

ఉచిత చెప్పుల స్టాండ్, 2 ఉచిత బస్సులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల కోసం ఉచితంగా చెప్పుల స్టాండ్, ఉచిత బస్సు సేవలకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. దుర్గగుడి పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత భక్తులకు ఉచితంగా చెప్పుల స్టాండ్ సదుపాయంతో పాటు దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి రెండు దేవస్థాన బస్సులను నడపాలని చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రతిపాదనలు చేశారు. వీటిని దేవదాయ శాఖ కమిషనర్ ఈ నెల 14వ తేదీ ఆమోదం తెలిపినట్లు సమాచారం. గురువారం దుర్గగుడి పాలక మండలి సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

'సప్తగిరి' శాఖ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): సప్తగిరి గ్రామీణ బ్యాంకు అగ్రస్థానంలో ఉందని ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గుంటుపల్లి గ్రామంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ 236వ శాఖను ఆయన బుధవారం ప్రారంభించారు. ఇండియన్ బ్యాంక్ ఫైనాన్షియల్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్, ఐబీ జీఎం మణి సుబ్రహ్మణ్యం, 'సప్తగిరి' ఏజీఎం జె.రామకృష్ణ, జనరల్ మేనేజర్ ప్రభాహరన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీలలితాంబికా పీఠంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ, పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షణలో పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపించారు.

స్వయం సహాయక సంఘాలకు ఇండియన్ బ్యాంక్ రుణాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వయం సహాయక సంఘాల సభ్యులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్‌కుమార్ బజాజ్ తెలిపారు. బుధవారం గాంధీనగర్ ఎస్ఆర్‌పీ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ కార్యక్రమం జరిగింది. 3844 గ్రూపులకు రూ.506.60 కోట్ల రుణ మంజూరు చేశారు. రిటైల్, అగ్రి, ఎం.ఎస్.ఎం.ఈ 1192 రుణాలు రూ.354.79 కోట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేశరామన్ , రూరల్ బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ సుబ్రమణియన్, జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం సితార సెంటర్‌కు చెందిన పాలిశెట్టి తిలక్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్‌లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో 18 నెలలుగా శిక్షణ పొందుతున్నాడు. గత నెల ఒకసారి ఇంటికి వచ్చి వెళ్లాడు. ఈ నెల 21న తల్లి లక్ష్మికి ఫోన్ చేసి తన కోచింగ్ పూర్తైందని, ఇంటికి తిరిగి వస్తున్నానని చెప్పాడు. ఈ నెల 22న ఆమె ఫోన్ చేయగా తాను విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగానని ఇంటికి వస్తున్నానని సమాధానం ఇచ్చాడు. కానీ ఇంటికి రాలేదు. అతని తల్లి లక్ష్మి ఫోన్ చేయడంతో తిలక్ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు స్టేషన్‌కు చేరుకుని చుట్టుపక్కల వెదికినా కనిపించలేదు. దీంతో తిలక్ తల్లి లక్ష్మి తన కుమారుడు కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలను ప్రోత్సహించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్‌హెచ్‌జీ(సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (మెప్మా) ఆధ్వర్యాన చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను బుధవారం గోదావరి గంగ ప్రారంభించారు. అనంతరం ఆమె వీఎంసీ అదనపు కమిషనర్ (యూసీడీ) శకుంతలతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రదర్శించిన వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత దిశలో ఎస్‌హెచ్‌జీ సభ్యులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వంలో వారిని బ్యాంక్ రుణాలను చెల్లించవద్దన్న చంద్రబాబు ఆ తరువాత నట్టేట ముంచాడని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రా మహిళలకు ఆయన ఇచ్చిన హామీ మేరకు రుణాలను ప్రభుత్వమే చెల్లించడానికి చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో గోదావరి బాబు తదితరులు పాల్గొన్నారు.